# గోడవైపు

పలివేటి నాగచంద్రావతి

ఓ పెన్ వరండా స్తంభాని కానుకుని కూర్చుంది సుమిత్ర. ఒళ్ళో పుస్తకమైతే ఉంది కానీ మనసూ, దృష్టీ కూడా దానిమీద లేవు.

పచ్చుమట్టీ, పేడా కలిపి అలికిన వాకిలి, తెల్లటి వరి పిండితో వే"సిన ముత్యాల పందిరి ముగ్గు, ముగ్గు మధ్య పనిమనిషి ఎర్రమ్మ కూతురు పెట్టి వెళ్ళిన గొబ్బెమ్మలు, వాటిపైన గుచ్చిన బంగారం ముద్దల్లాంటి గుమ్మడి పూలు... వాకిలి కలకలలాడుతున్నట్టే ఉన్నా ఎక్కడో ఏదో వెలితి...ఏదో అసంతృప్తి.

అప్రయత్నంగా సుమిత్ర చూపులు పక్కకి మళ్ళాయి. వెదురు కర్రల ఫెన్సింగ్ ఖాళీల్లోంచి పక్కింటివారి వాకిలి స్పష్టాస్పష్టంగా అవుపిస్తోంది.

ఆ ఇంటి ఇల్లాలు ఆదరాబాదరా చల్లిన నాలుగు చెంబుల నీళ్ళతో వాకిలి సరిగా అణగలేదు. హడావిడిగా వే"సిన పులిగోరు ముగ్గు వారింటి చిట్టితల్లు లిద్దరూ పొద్దుటే గొబ్బిళ్ళు పెట్టి గొబ్బి కట్టిన దానికి నిదర్శనంగా మూ డొంతులు చెరిగిపోయింది. వారి బుజ్జినాన్న పాలు తాగేందుకు మారాం చేస్తూ పరుగులెత్తిన కారణాన కొన్ని గొబ్బెమ్మలు అటూ ఇటూ చెదిరిపోయాయి. కొన్ని ఆ చిన్ని కన్న కాళ్ళ కింద పడి నలిగాయి. అయినా, ఆ వాకి లెంత నిండుగా, కళగా ఉంది! ఎంత సహజంగా ఉంది!! నిట్టూర్పు విడిచి తల తిప్పుకుంది సుమిత్ర.

మూ"సిన గేటు కిందనుంచి కోడిపెట్ట ఒకటి లోపలికి వస్తోంది. దాని వెనకే పూల బంతుల్లాంటి దాని పిల్లలు అరడజను. కోడిపెట్ట ముగ్గు కెలుకుతూంటే కిరు కిరు చప్పుడు చేస్తూ తల్లి కాళ్ళ చుట్టూరా తిరుగుతున్నాయి అవి.

ప్రహరీకి దగ్గరే ఉన్న నిమ్మచెట్టు కాయల బరువుతో వంగి ఉంది. బాదంచెట్టుమీది కాకి గూట్లో రెక్కలు రాని పిల్లలు ముక్కులు పైకెత్తి తల్లి తెచ్చిన ఆహారం కోసం గావును కీచు కీచుమంటూ అరుస్తున్నాయి. నూతిపళ్ళెం దాపున చే"సిన అరటిచెట్టు చుట్టూరా లెక్కలేనన్ని పిలకలు.

ఎక్కడో ఆవు 'అంబా' అంటూ చే"సిన శబ్దానికి మరెక్కడో చెంగనలు తీస్తున్న దాని లేగదూడ తిరిగి 'అంబా' అని బదులిచ్చిన సవ్వడి.

ఎటు చూ"సినా మాతృత్వం పొందిన స్త్రీత్వం మురి సే ముచ్చటలే! ఆ సంపద నించి తనని వంచించాడు భగవంతుడు. ఆ అదృష్టం తనకి లేదు; రాదు! సుమిత్ర కనుకొలకులు నీళ్ళతో నిండుకున్నాయి. తొణికి జల జల రాలి చెంపలను తడిపాయి.

"మిత్రా!"

తలెత్తింది సుమిత్ర. భర్త మోహన్! కలవరపడుతూ కళ్ళు దించుకుంది. కానీ, అప్పటికే అతనికి దొరికిపోయింది.

"ఏడుస్తున్నావా?" అతని గొంతులో ఆదుర్దా.

పట్టుబడిన దొంగలా లోపలికి పరిగెత్తింది సుమిత్ర.

ఆ రాత్రి గోడవైపు తిరిగి పడుకున్న సుమిత్ర భుజంమీద చెయ్యి వే"సి "మిత్రా" అన్నాడు



మోహన్. "రోజు రోజుకీ నువ్వెలా తయారవుతున్నావో నీకు తెలుస్తోందా?" అతని గొంతులో ఎంతో బాధ. మరెంతో ఆరాటం.

తన మౌనం...ఉదాసీనం...అన్నింటా నిరాసక్తత అతన్నెంత వ్యథకు గురి చేస్తున్నాయో సుమిత్ర అర్థం చేసుకోగలదు. చటుక్కున ఇటు తిరిగి భర్త గుండెలో తల దాచుకున్నది. భార్య జుత్తు నిమురుతూ ఉండిపోయాడు మోహన్ కొంత సేపు.

"మనకు పిల్లలు పుట్టరన్న సంగతి నిర్ధారణ అయింది. నిజంగా మన కది గొప్ప ఆఘాతమే. కాదనను. అందుకని ముందున్న జీవితమంతా వ్యర్థమే ననుకుంటూ కుమిలి కృశించటం పిచ్చితనం కదూ!" మోహన్ లాలనగా నచ్చచెబుతున్నట్టు అన్నాడు.

మాట్లాడలేదు సుమిత్ర. ఆమె గుండెకు మాసు పట్టని గాయమయింది. అది రేపుతోన్న విషాదం మాటలతో తీరేది కాదు. పైగా అతని లాలన ఆ గాయాన్ని తిరిగి రేపినట్టే అయింది. ఆమె భుజాలు దుఃఖంతో అదిరాయి. భార్య స్థితికి కదిలిపోతున్నాడు మోహన్.

"అదిగో మళ్ళీ...నన్ను చూడు—నాకు మాత్రం విచారం లేదూ? నీకుమల్లే దిగజారిపోతున్నానా?" వీపు నిమురుతూ మెత్తగా మందలించాడు.

అవును నిజమే. డాక్టర్ 'మీకు పిల్లలు పుట్టే అవకాశం లేదు' అని రిజల్టు చెప్పిన తరువాత అతను రెండు రోజులు స్తబ్దుగా, డల్‌గా ఉండిపోయాడు. ఆ తరువాత రొటీన్‌లో పడిపోయాడు. తన పనులలో బిజీ అయిపోయాడు. అంతే.

తానెందుకు అతనిలా తేరుకోలేకపోతోంది: తనలో మాతృత్వపు కాంక్ష బలంగా ఉండటం మూలానా? తనే ఏమిటి—ఏ స్త్రీకైనా అంతేనేమో! 'రాజ్యమేలే ఆడదానికైనా ఉయ్యాల ఊపాలనే కోరిక పోదే అమ్మడూ' అని అమ్మమ్మ అంటూండేది. ఇప్పుడు...ఇప్పటిదాకా మినుకు మినుకు మంటున్న ఆశ కాస్తా కొండెక్కి, తన కిక పాపల నెత్తుకునే యోగ్యత లేదు అని తెలిసిన తరువాత ఆ మాట ఎంత సత్యమో అవగతమవుతోంది.

తన మనశ్శరీరాలు సంతానం కోసం తహతహలాడిపోతున్నాయి! తపించిపోతున్నాయి. 'కమలాక్షు నర్చించని కరములు కరములే...' అన్నట్టు పాపని ఊపని ఒడి, లాలి పాడని గళం, స్తన్య మిచ్చి వారి చిరుబొజ్జ నింపని వక్షం, వారి ఆలనలో, పాలనలో అలవని శరీరం, వారి ముద్దు ముచ్చటలకు పరవశించని మనస్సు, వారి అభివృద్ధికి ఉప్పొంగని గుండె—ఎందుకూ నీ పుట్టుక దండుగ దండుగని హృదయం ఘోష పెడుతోంటే క్రుంగిపోక ఏమవుతుంది తను?

అతను మగవాడు. భార్యాపిల్లలు అతని జీవితంలో ఒక భాగం మాత్రమే. బయట ప్రపంచంతో అనేక వ్యాపకాలు... సాధించుకోవాలనుకునే విలువలు ఎన్నో ఉంటాయి అతనికి. ఆ తాపత్రయంలో పిల్లలు లేకపోవటమనేది పెద్ద లోటుగా అనిపించకపోవచ్చు అతనికి.

తన కేమున్నది? తన ఇల్లు, భర్త, పిల్లలు. అతి చిన్న పరిధి. అదే తన లోకం. సర్వస్వం. అది అతనికి తెలియనిదా?

తను ఆడదాన్ననీ, స్త్రీకి సంతానంతోనే సంపూర్ణత్వం సిద్ధిస్తుందనీ, ఆ కొరత తనని వట్టి వల్లారుస్తోందనీ...ఇవన్నీ అతనికి ఎలా చెప్పుకోవటం?

స్తబ్దుగా ఉండిపోయిన భార్య తలని నెమ్మదిగా దిండుమీదికి చేర్చి ముంగురులు సర్దాడు మోహన్.

"చదువుకున్న దానివి. ఏ సమస్యకైనా పరిష్కార మార్గ ముంటుందనీ, ఏ వెలితినైనా భర్తీ చేసుకోవచ్చుననీ తెలియదా నీకు?"

'తిరుగులేని శాపానికి పరిష్కారమా? తనలో ఏర్పడిన శూన్యాన్ని దేనితో నింపగలరు?' రెప్పలు రెపరెప లాడించింది సుమిత్ర.

"మనం ఓ పాపనో బాబునో దగ్గరకు తీద్దాం." మెల్లగా చెప్పాడు మోహన్.


"పెంపుడు బిడ్డలా—?" సుమిత్ర ముఖకవళికలు చేదు తిన్నట్టయాయి. "వాళ్ళు మనని మనఃస్ఫూర్తిగా తల్లీ తండ్రీ అనుకోగలరా?"

బిస్కట్లూ, చాక్లెట్లూ పెట్టినంత సేపూ తన ఒళ్ళో ఒదిగి, తల్లి కనబడగానే 'అమ్మా' అంటూ పరుగుతీసే పక్కింటి బాబు గుర్తు వస్తున్నాడు సుమిత్రకి.

"అవును—ఏం? కంటేనే మన బిడ్డ లవుతా రనుకోవటం తెలివితక్కువ మిత్రా! ఏ తల్లికన్నా ప్రతి బిడ్డా దైవ స్వరూపమే. మన, తన భేదం లేదు వాళ్ళకి. మనం మమతానురాగాలు చూపిస్తే వాళ్ళూ ప్రేమాభిమానాలు కురిపిస్తారు. పోతే కన్నా, కనకపోయినా ప్రతి స్త్రీ హృదయమూ మాతృ మందిరమే అని నా నమ్మకం. ఇక నువ్వా—ఎంత మొహమాటం చూపించే పాపనైనా ఇట్టే మచ్చిక చేసుకోగలవు. నాకు తెలుసు. ఇక సందేహాలు పెట్టుకోకు." భార్య చెంపలు తడుతూ ఆమె సంశయాన్ని ఎగరగొట్టేశాడు మోహన్.

ఆలోచనలో పడింది సుమిత్ర. ఏది ఏమైనా తమ ఇంట్లోనూ 'చిన్నారి పాపడు దోగాడబోతున్నాడు' అన్న ఊహకే పులకరించిపోతున్నది ఆమె మనసు.

** ** **



ఆ మర్నాటి నుంచీ రోజల్లా సుమిత్రతో తర్జన భర్జనలు.

'పావని పెంచుకుందామా—బాబునా! పాలు తాగే పసివయసు వాణ్ణి తెచ్చుకుంటే బాగుంటుందా—లేకపోతే బాలారిష్టాలన్నీ గడిచి కాస్త రెక్కగట్టిన పిల్లల్ని తెచ్చుకోటం మంచిదా? అస లెవరిని పావనిమ్మని అడగటం? స్నేహితుల్నా...బంధువుల్నా... లేక ముక్కూ మొహం ఎరగని పరాయివాళ్ళనా? అసలు తామలా సిగ్గు విడిచి మీ బిడ్డ నిమ్మని అడగగలరా? అడిగినా ఎవరైనా అంత సులువుగా తమ బిడ్డని ఇవ్వగలరా?

ఇవన్నీ బయట కనటానికి జంకు. ఏదో ఇంట్లోకి ఏ విలువైన వస్తువో కొనుక్కోటానికి 'ఈ కంపెనీదైతే మంచిదా, ఆ కంపెనీదా' అని సంప్రదించుకుంటున్నట్టు ఏమిటా ప్రశ్నలు అని భర్త అనుకుని పోతాడేమోనని శంక. కానీ, అతనికి తప్ప ఇంకెవరితో చెప్పుకుంటుంది తన ఘోష!

భార్య అనుమానాలన్నిటికీ ఒక్క చిరునవ్వే సమాధానంగా విసిరి ఊరుకున్నాడు మోహన్. ఆ నవ్వులో అర్థాలు వెతుకుతూ ఉండిపోయింది సుమిత్ర.

ఆ రోజు సాయంత్రం మామూలు కంటె పెందరాళే ఇంటికి వచ్చాడు మోహన్. చేతిలో స్వీట్ పాకెట్.

మునుపటిలా ఎందుకూ ఏమిటని ప్రశ్నించే ఆసక్తి కూడా తగ్గిపోయింది సుమిత్రకి.

"త్వరగా తయారవు మిత్రా! అలా బయటకు వెడదాం. నీ కో గమ్మత్తు చూపిస్తాను. ఎంతానందిస్తావో!" అన్నాడు మోహన్ భార్యను హుషారు చేస్తూ.

'పాపం అతను తన ముఖ్యమైన వ్యవహారాల నెన్నిటినో వాయిదా వేసుకుని తన విచారాన్ని మరిపించటానికని ఈ మధిరివి ఏవేవో ప్రోగ్రాములు వేస్తున్నా డీ మధ్య. కాదని అతణ్ణి నొప్పించటం ఇష్టం లేదు సుమిత్రకి. తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతోనే బయలుదేరింది.

పావు గంటలో ఒక చిన్న ఇంటి ముందు స్కూటరాపాడు మోహన్.

"మూర్తిగారనీ—కొత్తగా పరిచయమయ్యారులే—నీకు తెలీదు." సుమిత్ర మొహంలో ఆశ్చర్యం చూసి స్కూటర్ని ఓ పక్కగా పార్క్ చేస్తూ చెప్పాడు.

సుమారు మూడొందల గజాల స్థలంలో మధ్యగా డాబా, నాలుగువేపులా బంగళా పెంకులతో దించిన వసారాలూ...ముచ్చటగా పొందికగా ఉంది ఇల్లు.

గేటు నుంచి వరండా వరకు వంచిన ఆర్చికి గన్నేమాలతి దట్టంగా పాకింది. గుత్తులు గుత్తులుగా విచ్చుకుని గుబాళిస్తున్న పువ్వులు వచ్చే అతిథులకు స్వాగతాలు పలుకుతున్నాయి.

గేటు తీసిన చప్పుడుకి సింహద్వారాని కున్న కర్టెను కొద్దిగా తొలగించి చూసి, ఆ వెంటనే బయటికి వచ్చా డొకాయన.

"రండి రండి" అని చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, "మీకోసమే ఎదురుచూస్తున్నాము" అంటూ సాదరంగా వారిని లోపలకు తీసుకువెళ్ళాడు.

"కూర్చోండి" అని సోఫా చూపించి "లలితా" అని పిలుస్తూ లోపలకు వెళ్ళాడు.

"మూర్తిగారంటే ఈయనే" అన్నాడు మోహన్ సుమిత్రతో.


కొత్త అనగానే కలిగే సహజమైన కుతూహలంతో చుట్టూ పరికించింది సుమిత్ర.

గదికి మధ్యగా కార్పెట్. దానిమీద సోఫా సెట్. ఓ కార్నర్‌లో టి. వి. పక్కగా బుక్ రేక్. దానిమీద నిమీలిత నేత్రాలతో నాద సుధారసాన్ని ఆస్వాదిస్తున్న మీరాబాయి ప్రతిమా గోడలకి ఒకటీ, రెండు ప్రకృతి దృశ్యాలూ... డ్రాయింగ్ రూమ్ సింపుల్‌గానే కాక కళాత్మకంగా ఇంటివారి అభిరుచిని చాటి చెప్పేలా ఉంది.

ఇంతలో మూర్తిగారి దంపతులు వచ్చారు. పరస్పర పరిచయా లయ్యాయి. మోహన్ మూర్తిగారితో పిచ్చాపాటీలో పడిపోయాడు.

సుమిత్రకి మాత్రం మహా ఇబ్బందిగా ఉంది. అసలే ఒకరితో కలవటానిగ్గానీ, సరదాగా గడపటానిగ్గానీ ఒప్పటంలేదామె మన స్థితి. పైగా ఇక్కడి కొత్తదన మొకటి. కాకపోతే మూర్తిగారి భార్య అడిగే వాటికి క్లుప్తంగా జవాబులిస్తూ మర్యాద చెడకుండా మాత్రం చూసుకుంటోంది.

ఆమెకి అందుకోసమే వచ్చినట్టు బాతాఖానీలో పడిపోయిన భర్త ఆంతర్యం బోధపడలేదు.




గమ్మత్తన్నాడు—సంతోషిస్తానన్నాడు—ఏది? ఏమిటది? ఎక్కడుంది?

"గుడీవినింగ్

మమ్మీ—డాడీ—ఓహ్—ఆంటీ—అంకుల్ కూడా ఉన్నారా! గుడీవినింగ్ ఆలాఫ్ యూ."

ఒక మలయపవన వీచిక...ఒకానొక చైతన్య కెరటం నిస్తేజంగా, నిస్సారంగా ఉన్న ఆ వాతావరణంలోకి దూసుకు వచ్చింది.

తాపీగా పారుతున్న ఏటిలోకి వరద వెల్లువ ఉరికినట్టు, చెక్కిపెట్టిన శిల్పాలకు ఎవరో దేవత ప్రాణప్రతిష్ఠ చేసినట్టు అంతవరకూ ఏదో మొక్కుబడిగా చప్పచప్పని మాటలతో కాలం నెడుతున్న వాళ్ళందరిలోనూ ఒక్కసారిగా మార్పు వచ్చింది.

నవ్వులు. కేరింతలు. గదంతా ఉత్సాహమే!

ఇంత చమత్కారానికి కారణమైన ఆ పరవళ్ళ సెలయేరు వయస్సు అయిదేళ్ళు. ఒళ్ళు బంగారం. కళ్ళు కలువరేకులు. బుగ్గలు విచ్చిన గులాబిలు. పేరు... "మా కన్నతల్లి రుక్మిణి...మా అమ్మ పేరది." మూర్తిగారు మక్కువగా ఆ అమ్మాయిని ఒళ్ళోకి తీసుకుంటూ వివరణ పూర్తి చేశారు.

ఆ తరువాత ఆ చిన్నారి పావ సమక్షంలో గంటలు క్షణాలుగా గడిచాయి. ఎన్ని రైమ్స్ చెప్పిందని—ఏం అభినయం చేసిందని—ఏం పాటలు...కథలు—ఓహ్—ఉత్సాహం, ఆహ్లాదం వెలువలై పారా యక్కడ.

నిజంగానే సుమిత్ర మైమరిచిపోయింది. కడుపులో తెములుతున్న వ్యథ మరిచిపోయి తానూ వారితో పాటు నవ్వింది. చప్పట్లు కొట్టింది. చిన్నపిల్లై ఆడింది.

"ముచ్చటైన పావ కదండీ!" వస్తూన్నప్పుడు భర్త భుజంమీద చేయి వేసి అన్నది సుమిత్ర.

"వెరీ స్వీట్ బేబీ" అన్నాడు మోహన్. ఒక్క నిముషమాగి మళ్ళీ, "నీ కా పావ బాగా నచ్చింది కదూ!" అన్నాడు మెత్తని స్వరాన.

చప్పున "చాలా" అని చెప్పిందే కానీ వెంటనే సుమిత్రలో ఏదో సందేహం పొడసూపింది, ఎందుకలా అడుగుతున్నాడా భర్త అని.

'తా మొక బిడ్డని పెంచుకోవా లనుకుంటున్నారు. ఇప్పుడు భర్త ఆ పావ నచ్చిందా అని అడుగుతున్నాడు తనని. ఈ రెంటికీ ఏమైనా లింక్ ఉందా?'

"ఆ పావ వారికి పుట్టిన పిల్ల కాదు." తాపీగా అన్నాడు మోహన్.

"నిజం?" స్తన్నయి పోయింది సుమిత్ర.

"పిల్లలు పుట్టకపోతే ఆర్ఫనేజి నుంచి రోజుల పిల్లగా ఉన్నప్పుడు తెచ్చుకున్నారట." ముడి విప్పుతున్నట్టు ఒక్కొక్క మాట నింపాదిగా చెబుతున్నాడు మోహన్. "మంచి పని కదూ! తెలివైన పని కూడా!"

దేనికో ఇది ప్రస్తావన అని అర్థమైంది సుమిత్రకి. విని ఊరుకున్నది. ఆమె ఆలోచనలకి గాప్ ఇస్తున్నట్టుగా ఇంటికి చేరేవరకూ మరి మాట్లాడలేదు మోహన్.

అలా అని మరీ జాప్యమూ చేయలేదు. డైనింగ్ టేబిల్ దగ్గరే తన మనసులో మాట బయట పెట్టేశాడు.

"మిత్రా, మనం కూడా ఆర్ఫనేజి నుంచి ఒక పావని తెచ్చుకుందామా?"

ఇష్టమూ, అయిష్టమూ కాని సందిగ్ధభావం కదలాడింది సుమిత్ర కళ్ళలో.

"ఏ కులమో, మతమో తెలియదు. ఏ అవినీతికి ఫలమో తెలియదు. అలాటి పిల్లల్ని పెంచుకుంటే వాళ్ళు మంచిగా ఉంటారనేమిటి? ఎత్తెస లేని ఆ తల్లీ, తండ్రీ నీచులూ, కర్కోటకులూ, దొంగలూ, జారులూ లాంటి వాళ్ళైతే ఆ నెత్తురు పారుతున్న వీళ్ళు కూడా ఆ వారసత్వంగా ఆ లక్షణాలూ, గుణాలూ పుణికి పుచ్చుకోరా? వాళ్ళు పెరిగి మనకు కంటకాలుగా తయారైతే అప్పుడు మనక్కలిగే క్షోభకంటే, పిల్లలు లేరనే ఈ చింతే తేలికైనదేమో? చేతులారా ఆ బాధ నెందుకు కొనితెచ్చుకోవాలి?"

"ఎంత అజ్ఞానంగా ఆలోచిస్తున్నావు నువ్వు!" సింక్ దగ్గర చేయి కడుక్కుంటూ అన్నాడు మోహన్.

సుమిత్ర వంటిల్లు సర్ది వచ్చింది. భర్త రోజులా పుస్తక పఠనంలో లేడు. మంచం నడుంమీద బాసింపట్టు వేసుక్కూర్చున్న అతని తరహా ఇంకా తనకి బోధించడానికే నని అర్థమైంది. అనుకున్నట్టుగానే తమలపాకులు చిలకలు చుట్టి ఇస్తున్న సుమిత్రకు చెప్పటం ప్రారంభించాడు మోహన్.

"మిత్రా! జన్మతః ఏ బిడ్డా కూడా నీచుడూ దుష్టుడూ అవడు. పుట్టుకలో ఏ వంశపావలోనైనా గుణాలెరగని, కల్మషాలంటని స్వచ్ఛమైన రక్తమే ప్రవహిస్తుంటుంది. క్షేత్రం ఏదైనా అవనీ, అప్పుడే పుట్టిన పాప మాత్రం పరమ పవిత్రుడే. మకిలి పట్టని కొత్త అద్దం వంటివాడే. ఆ తరువాతే పరిసరాలూ, పెరిగిన వాతావరణమూ, తటస్థించిన పరిస్థితులూ అతగాణ్ణి దానవుడిగానో, మానవుడిగానో మార్చుతాయి.

నారు తెచ్చి సారవంతమైన భూమిలో నాటితే ఏపుగా ఎదుగుతుంది. ఊసరక్షేత్రంలో పాతితే గిడసబారుతుంది. పిల్లలూ అంతే. సరియైన పోషణా, శిక్షణా ఉంటే మనకీ, సంఘానికీ అలంకారాలుగా తయారవుతారు. అలక్ష్యం చేస్తూ, మన బలహీనతల్ని వాళ్ళకి రుద్దితే, లేక కాని పరిస్థితులు ప్రేరేపించి వక్రమార్గం పట్టిస్తే మనకి సమస్యలుగా మారతారు. అంతేగానీ, హంతకుడి కొడుకు హంతకుడూ, వ్యభిచారి కూతురు వ్యభిచారిణీ అవుతారనుకోవటం కేవలం అవివేకం."

తల వంచి వింటోంది సుమిత్ర.

తనకి ఇవన్నీ తెలియని సంగతులా? కానీ, మనకు తెలియకుండానే మనలో జీర్ణించుకుపోయిన నమ్మకాలివి. అవి మూఢవిశ్వాసాలని తెలిసినా తోసిపుచ్చలేని వీకనెస్ తనది.

"అసలీ గొడవంతా ఎందుకు? మీ అన్నగారి పాపనో, మా అక్కగారి పిల్లల్నో పెంచుకుంటే సరికదా అనొచ్చు నువ్వు. కానీ, నా కెందుకో అది అంతగా మనస్కరించటంలేదు. ఎందుకంటే—ఉదాహరణకి మా అక్క ఉంది. దాని సంతానం ఆరుగురు. ఒకరిని మనం పెంచుకుంటామంటే కాదనదు సరికదా అదే మహాభాగ్య మంటుంది. అనటమే తరువాయి తీసుకొచ్చి దించిపోతుంది కూడా! అంతవరకూ బాగానే ఉంటుంది. ఇహ అప్పట్నించే మొదలవుతాయి మన పాట్లు! మా అక్క ఉంది చూశావ్—అనకూడదు గానీ ఉత్తకాపీనం మనిషి. దానికి ముందునుంచీ నా సంపాదనమీదే దృష్టి. ఇంటి ఆడపడుచు అని మనం ఇంతో అంతో పెడుతూనే ఉన్నా ఆ కంటికి ఆనదు. ఎంత పెట్టినా పెట్టలేదనటం, ఇంతేనా అనటం, అలకలు సాగించటం నువ్వూ ఎరుగుదువు. దాని కొడుకుని దగ్గరకు తీశామనుకో- డైరెక్టుగా పర్మనెంటుగా మనల్ని పీడించటానికి రైట్సు దొరికినట్టే దానికి. దాని ఆశపోతుతనానికి హద్దుండ దిక. మొత్తం తోడిచ్చినా తృప్తి పడదు. ఇదేమనటానికి ఉండదు. నా కొడుకుని తీసుకుపోతానంటుందేమోనని భయం కదా! అలా క్షణ క్షణ గండంగా పిల్లాణ్ణి ముందు పెట్టుకుని బేరాలాడవలసి రావటమంత దౌర్భాగ్యం మరొకటి ఉండదు. అందుచేత దాని పిల్లల్ని మాత్రం మన మడగొద్దు.

"పోతే మీ అన్నగారికి ఇద్దరే పిల్లలు. నా ఉద్దేశం పెంపు ఇవ్వటానికే ఇష్టపడరని. ఒకవేళ నీమీద అభిమానం కొద్దీ సరేనన్నా మనఃస్ఫూర్తిగా మటుకు కాదు. మొహమాటం కొద్దీ ఇచ్చినా పాప మనకి మాలిమి అయ్యే అవకాశాలు మాత్రం ఇవ్వరు."

"అదేమిటి?"

"ఏమిటంటే ఆ పిల్లదానిమీద అపేక్ష వదలక మీ అన్నా, వదినా తరుచు వచ్చి పోతూంటారనుకో. లేదా ఆ పిల్లనే తీసుకువెడుతూంటారనుకో. మన మేమీ అనలేం కదా. ఫలితంగా మనమెంత పాకులాడినా పాప మనిషి ఇక్కడా, మమత అక్కడగా పెరుగుతుంది. చివరికి వ్రతం చెడ్డా ఫలం దక్కనట్టు పాప మన ఆస్తికి వారసురాలవుతుందే తప్ప తననుంచి మన మాశించే ప్రేమానురాగాలు మాత్రం లభించవు.

"మీ అన్నా, మా అక్కే కాదు, మరెవరి పాపని పెంచుకున్నా ఈ రెండు రకాల పరిస్థితుల్నీ మనం ఎదుర్కోక తప్పదు. మూర్తిగారికిలా అయితే ఆ పాప పూర్తిగా మనది. ఆమెమీద ఎవరి జోక్యమూ, అధికారమూ ఉండవు. ఎవరి ఒత్తిడీ, బెదరింపూ ఉండవు.

"మిత్రా! కొంచెం ఆలోచించి చూస్తే నీకే తెలుస్తుంది. తల్లీ, తండ్రీ, సమాజం అండా అన్నీ ఉన్న పిల్లలకి మన అవసరం ఏముంది? వాళ్ళనే పెంచుకోవాలనుకోవటం చెట్టు కింద ఉన్నవాళ్ళకి అక్కరలేకపోయిన గొడుగు నీడ కూడా పడతామనటం లాంటిది. అదేమంత సముచితం! అంతకన్నా కన్నవారి ఒడినుండి విడివడి నా అన్నవారు లేక ఒకరి దయమీద దయనీయమైన బతుకు బతుకుతున్న ఆ అనాథ జీవుల్లో ఒకరికైనా చేరదీసి భద్రత కల్పించటంలో ఔచిత్యం లేదా?"

ఒక్క క్షణం ఆగాడు మోహన్.

"కలబోసి అందించా లనుకుంటున్న మన ఇద్దరి ప్రేమనీ రెండు చేతులా అందుకునే పాప కావాలని నా ఆశ మిత్రా! కన్నవారి మమకారం పోగొట్టుకుని దాని కోసం పాకులాడే ఆ అనాథలు కోరుకున్నంత గాఢంగా మరెవరు కావాలంటారు మన ప్రేమని? మిత్రా! నా అభిప్రాయం చెప్పాను. తప్ప, అదే చేయాలనే నిర్బంధం లేదు సుమా! నువ్వు ఇష్టపడిన పాప ఎవరైనా నాకు సమ్మతమే. నువ్వు దిగులు పడకుండా సంతోషంగా ఉండటమే నాక్కావాలి."

సుమిత్రకు తెలుసు- ఇంట్లో ప్రతిదాంట్లో తన పెత్తనమే సాగాలనుకునే హిట్లర్ కాదు మోహన్. తన ఇష్టానికీ, అభీష్టానికీ ఎప్పుడూ ప్రాధాన్య మిస్తాడు. అందుకనే అతనంటే ఆమెకు ఎనలేని ప్రేమ. ఆరాధన. గౌరవం.

సుమిత్ర ఏదో చెప్పాలని నోరు తెరిచింది. కానీ, తానే తేల్చుకోలేని ఊగిసలాట. అతను మంచితనంతో ఏదో ఆదర్శంగా మాట్లాడాడు కదా అని తను మరీ చొరవగా వికట నిర్ణయం తీసుకోబోవటం లేదు గదా అన్న సంశయం. తటపటాయిస్తూ ఆగిపోయింది సుమిత్ర.


ఏమిటని రెక్కించలేదు మోహన్.

** ** **

నాలుగు రోజుల తరువాత అడిగాడు మోహన్-"ఆర్ఫనేజికి రాయమంటావా?" అని.

అప్పుడూ ఏదో చెప్పబోయి ఆగింది సుమిత్ర. మౌనంగా తల ఊగించింది.


పది రోజులయ్యాక, "వాళ్ళ దగ్గర్నించి జవాబు వచ్చింది మిత్రా! రేపు మంచిదేనా—వెడదామా"



# రిజర్వేషన్స్

JAIBUN

Zakir...



అన్నప్పుడు కూడా అదేలాంటి భావం కళ్ళలో—ఏదో చెప్పాలని ఉండీ చెప్పలేకపోతున్నట్టు—పై కనబోయిన మాటల్ని లోపలికి గుటక వేసి ఆపేసింది మళ్ళీ.

ఆమె ఏదో చెప్పడానికి సంకోచిస్తున్నట్టు గ్రహించాడు మోహన్.

"నువ్వేమిటో సందేహిస్తున్నట్టున్నావు మిత్రా! నా సజెషన్ నచ్చకపోయినా నేను నొచ్చుకుంటానని సరే నంటున్నావు కదూ?"

అత నపార్థం చేసుకున్నందుకు గాబరా పడింది సుమిత్ర.

"అబ్బెబ్బే లేదు-లేదండీ! మీరు చెప్పింది ఎంతో సమంజసంగా ఉంది. ఆ విషయంలో నాకే అభ్యంతరమూ లేదు" అంది.

కానీ, ఆమె కళ్ళలో ఏదో బయటపెట్టాలనే ఆరాటం మిగిలే ఉంది. అయితే ఆర్ఫనేజిలో పాలబుగ్గల పసిపిల్లల్ని చూసేసరికి సర్వమూ మరిచిపోయింది సుమిత్ర.

పసిపిల్లలే కావాలని ముందే చెప్పటంవల్ల ఏడాదిలోపు పిల్లల్ని ఒక రౌండ్ చూపుతోంది ఆయా. ఆర్ఫనేజిలో పిల్లలంతా ఆరోగ్యంగా, శుభ్రంగా, అరవిచ్చిన పువ్వుల్లా ఉన్నారు.

ఉయ్యాలల్లో కాళ్ళూ, చేతులూ ఊపుకుంటూ వాళ్ళు పోగొట్టుకున్న దేమిటో తెలియని అమాయకత్వంతో బోసినవ్వులు చిలకరిస్తున్న ఆ పసివాళ్ళని చూస్తుంటే, సాధ్యమైతే విధివంచితులైన ఆ పాపలందర్నీ అక్కున చేర్చుకుని లాలించాలనే బలమైన కాంక్ష సుమిత్రని ఊపేసిం దొక క్షణం!

నడుస్తూ నడుస్తూ ఓ ఉయ్యాల దగ్గర ఆగిపోయింది సుమిత్ర.

నెల రోజుల వయసన్నా ఉంటుందో లేదో—నుదురు కప్పేస్తున్న నల్లని జుట్టుతో, నక్షత్రాల్లా మిలమిల మెరుస్తున్న కళ్ళతో ఆమెను ఆకట్టుకున్నాడా తొట్టిలో బాబు. చివురుటాకుల్లాంటి గుప్పిళ్ళు మూసి తెరుస్తూ, గులాబి రేకు పెదాల్ని కదిపి ఏదో తెలియని దేవతా భాషలో శబ్దాలు చేస్తూ ఆమెను కదలనీయలేదు.

గమ్మత్తుగా మోహన్‌ని కూడా ఆ బాబే ఆకర్షించినట్టున్నాడు- "మిత్రా! వీడు మనవాడే అనిపించటం లేదూ?" అన్నాడు మక్కువగా బాబుని చేతుల్లోకి తీసుకుంటూ.

మౌనంగా తల ఊగించింది సుమిత్ర. వెలిగిపోతున్న ఆమె కళ్ళలో పూర్తి అంగీకారాన్ని చదువుకున్న మోహన్ తృప్తిగా నిట్టూర్చాడు.

ఆ తరువాత సుమిత్ర తను తెచ్చిన పళ్ళూ, స్వీట్స్ పెద్ద పిల్లలకి పంచుతూంటే మోహన్ ఆ బాబుకి సంబంధించిన రికార్డు, పెంపకానికి సంబంధించిన రూల్సు వగైరా డిటెయిల్స్ ఆఫీసులో కనుక్కుని పూర్తి చెయ్యవలసిన కాగితాలూ అవీ తీసుకువచ్చాడు. వీలైతే అప్పటికప్పుడు బాబుని తమవా డనిపించుకుని వెంట తీసుకువెళ్ళిపోవాలనుంది వాళ్ళిద్దరికీ. కానీ, ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి అయితే గానీ ఆర్ఫనేజి అందుకు అంగీకరించదు.

వెళ్ళిపోయే ముందు బాబుని పదే పదే ముద్దాడి విడవలేక విడవలేక విడిచిపెట్టింది సుమిత్ర- 'ఇంకొన్నాళ్ళు ఈ ఉయ్యాలలోనే ... కన్నా. ఆ తరువాత నా అంకసీమనే ఉ... చేసి ఊపుతాను నిన్ను' అనుకుంటూ.


** ** **

మోహన్ తన పలుకుబడితో తొందరగానే ఆర్ఫనేజి వాళ్ళ నిబంధనలన్నీ పూర్తి చేసి బాబుని తెచ్చుకునేందుకు పర్మిషన్ సంపాదించాడు. సుమిత్రలో వెనకటి ఉత్సాహం తిరిగి వచ్చింది. బాబు రాకకోసం ఆమె చేసే సన్నాహ సంరంభం ఉత్సుకతతో గమనిస్తున్నాడు మోహన్.

లేపాక్షి నుంచి చక్కటి కేన్ ఉయ్యాల తెచ్చి హాల్లో వేయించింది. పొత్తిగుడ్డలకి మృదువైన బాబు ఒళ్ళు నొవ్వకుండా గ్లాస్గోగుడ్డ కొని తెచ్చింది. ముచ్చటైన బుల్లి బుల్లి డ్రస్సులు, పాలసీసా, ఫారెక్సు కలపడానికి చిన్న వెండిగిన్నె, సాయంత్రం షికారుకి పెరాంబులేటర్...ఇంకా 'ఇంకా ఎన్నో... బాబుని తీసుకొచ్చే రోజు దగ్గర పడేకొద్దీ ఏ గదిలో చూసినా పాపాయి సామానే కనబడసాగింది.

తన ఎదమీద తల పెట్టి పడుకున్న సుమిత్రతో పరిహాసంగా అన్నాడు మోహన్- "మిత్రా! రాకుండానే ఆ బుజ్జిదొంగ నీ మనసుని పూర్తిగా ఆక్రమించేశాడు. ఇహ వచ్చాక నిన్ను నా మొహమన్నా చూడనిస్తాడా అని!"

"ఎంత మాటన్నారు? మీ తరువాతే ఎవరైనా." అంటుందనుకున్న మోహన్‌కి ఆశాభంగమైంది. నిజమే నన్నట్టుగా చిరునవ్వు నవ్వుతోంది సుమిత్ర.



ఎక్కణ్ణించో వినిపిస్తోంది భూపాల రాగంలో శ్రావ్యంగా సన్నాయి గీతం. ఇంకా ప్రకృతి చీకటి తెరల్ని తొలగించలేదు. అప్పుడే కళ్ళు విప్పిన సుమిత్రకి ఆ రోజు ప్రాముఖ్యం ఏమిటో స్ఫురించి నిద్రా, బద్ధకం ఎక్కడి దక్కడ పటాపంచలయ్యాయి.

అవును, ఈ రోజే బాబుని ఇంటికి తెచ్చుకునేది! ఉత్సాహంతో కూడిన చురుకుతనం నరనరానా పాకి, ఒంట్లో అణువణువునీ మేల్కొలిపి లే లెమ్మంటూ ఇక పడుకోనిచ్చింది కా దామెను. పక్కన గాఢనిద్రలో ఉన్నాడు భర్త. సద్దు కానీకుండా మెల్లగా మంచం దిగింది సుమిత్ర.

మెల్లమెల్లగా అడుగులు వేస్తూ ఇల్లంతా కలయతిరిగింది, ఏమయినా సర్దవలసింది ఉందేమోనని. నిన్న సాయంత్రమే దులిపి, కడిగి తీరుగా సర్ది పెట్టిన గదులు, 'నీతోపాటు మేమూ ఈ ఇంటికి వచ్చే యువరాజావారికి స్వాగత మిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా' మంటున్నాయి.

'ఇక నాలుగైదు నెలలు పోయాక బాబుకి పాకడం వస్తే ఈ కింద ఉన్న సామానులన్నీ ఎక్కడివక్కడ ఉండనిస్తాడా?'

మొలకి మామిడి పిందెలు, కాళ్ళకి మువ్వలు, జుట్టంతా పైకి దువ్వి కట్టిన శిఖ- చిన్నికృష్ణుళ్ళా ఉన్న బాబు దోగాడుతూ దోగాడుతూ చేతి కందినవన్నీ తలకిందులు చేస్తూన్న దృశ్యం మనసుకు పొడగట్టి పులకించిపోయింది సుమిత్ర. చకచకా కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసింది. పూజగది శుభ్రం చేసి పూలసజ్జ తీసుకుని పెరట్లోకి వచ్చింది.

అప్పటికి ఉషోదయ మవుతోంది. పువ్వులు కోసేముందు మొక్కల నో మారు కళ్ళ నిండుగా చూసుకోవడం సుమిత్ర అలవాటు.

కొమ్మల నిండుగా పూసిన ముద్దమందారాలు, నేలని పూల తివాచీగా మార్చిన పారిజాతాలు, తమ ఉనికిని ఆమడ దూరానికి తెలియజేసే సంపెంగలు, సన్నజాజులు...వీటన్నిటికీ దూరంగా ఎడంగా విడిగా తన ఆధిక్యాన్ని చూపుతూ ఏకైక సుమరాజ్ఞిలా తలఎత్తి చూస్తున్న పచ్చగులాబి...దాన్ని అందుకోవడానికి ఒక్కడుగు ముందు కేయబోయిన సుమిత్ర క్షణం ఆగింది. ఆగి కిందికి చూసింది.

కాలికింద ఒత్తుగా ఎదిగిన పచ్చిక. దానిలో అప్పుడే పూచిన గడ్డిపూవు. వెలాతెలా పోతున్న రంగు, ఆకర్షణ లేని రూపు. బేలగా చూస్తోంది 'నీ పూజకు నేను తగనా' అన్నట్టుగా.

మనస్సును పీడించిన సమస్యను మరువజూస్తున్న సమయాన అకస్మాత్తుగా ఎట్టఎదుట ప్రత్యక్షమై ప్రశ్నిస్తున్నట్టై కలవరపడింది సుమిత్ర. వివర్ణమైం దామె మొహం. నెమ్మదిగా వంగి మోకాళ్ళమీద కూర్చుంది సుమిత్ర. కొనవేలితో మృదువుగా ఆ పూవును స్పృశించింది. పూవు రేకు రేకునా నోరు విప్పి ఏదో చెప్పబోతున్న అనుభూతి.

'నీకింత పక్షపాతం తగునా అమ్మా. నీ కళ్ళు ఆ పైనున్న అందాలరాణిపైనే వాలేయి కానీ నీ కాళ్ళకింద నలగబోయిన నన్ను గమనించాయా! కన్ను చెదిరే రంగూ, విరజిమ్మే సువాసనా లేనిదాన్ననే కదా నన్ను చిన్నచూపు చూస్తున్నావు? అది నా తప్పిదమా అమ్మా! సర్వమూ ఆ పరమేశ్వరుడి సృష్టే అయినప్పుడు ఆ సృష్టిలో భాగాన్నైన నాకు ఆ దేవుడి పాదాలు తాకే అర్హత ఎందుకుండదో ఆలోచించమ్మా' అని నిలదీసి అడుగుతున్నట్టూ—

'గడ్డిపూవునే అయినా ప్రతి పూవూ కోరుకున్నట్టే నాకూ ఆ సర్వేశ్వరుడి పాదాల వాలాలనే కోర్కె ఉందమ్మా-నా కా అవకాశం కల్పించవా?' అని ప్రాధేయపడుతున్నట్టూ.

'జాతి పుష్పాలనైతే ఎవరో ఒకరు భగవంతుని కర్పిస్తారు. లేదా శిరస్సుమీదైనా ధరిస్తారు. ఎవరి కాలికిందో పడి నలిగి నశించటం తప్ప నా వంటి అనామకులని ఎవరు పట్టించుకుంటారు? అమ్మా! నీవయినా నన్నుద్ధరించి ఆ పవిత్ర స్థానానికి చేర్చి పుణ్యం కట్టుకోవా' అని అర్థిస్తున్నట్టూ—

కరిగి నీరైంది సుమిత్ర గుండె. ఓదారుస్తున్నట్టుగా మెత్తగా నిమిరింది పువ్వుని. నొప్పి తెలియకూడదన్నట్టు నెమ్మదిగా దాన్ని కోసి సజ్జలో ఉంచి లేచి వెనుతిరిగింది.

ఆరు గంటలవుతూండగా—

అలారం గణగణ మోగింది. పక్కకి చెయ్యి జాపి దాన్ని నొక్కి ఆవలిస్తూ పైకి లేచాడు మోహన్.

ఎదురుగా సుమిత్ర!

అలవాటైన కాఫీ కప్పుతో కాదు. పొత్తిళ్ళలో నిదురిస్తున్న పసిగుడ్డుతో. కళ్ళు పెద్దవయ్యాయి మోహన్‌కి. నిటారుగా అయి విభ్రాంతిగా చూశాడు. చిరునవ్వుతో దగ్గరగా వచ్చి పిల్లవాణ్ణి మంచంమీద ఒద్దికగా పడుకోబెట్టింది సుమిత్ర.

నల్లటి నలుపు. బక్కపలచగా ఒక కాలూ, చేయూ అవిటివిగా ఉన్న ఆ పిల్లాణ్ణి వెంటనే గుర్తు పట్టాడు మోహన్.

ఇదివరలో తమ ఇంట్లో పని చేసిన బంగారి కొడుకు వాడు. నెల్లాళ్ళ క్రితం ఈ అవిటివాణ్ణి కని ప్రసవంలోనే వాతం కమ్మి కళ్ళు మూసింది తల్లి. తాగుబోతు తండ్రి అంతక్రితమే ఎవతెనో తగులుకుని దేశాలు పట్టి పోయాడు. దిక్కుమాలిన ఈ పసికందుని చేరదీసినవారు లేరు.

పాలు పోసే మాలక్ష్మి వాణ్ణి గురించి అన్న మాటలు ఇప్పటికీ జ్ఞాపకమే మోహన్‌కి.

"కాలూ, చెయ్యీ సరిగ్గా ఉంటే గొడ్లకాడి పనికన్నా ఉంటాడని సాకేదాన్ని. గానీ—సొట్టోడు—వీ డెందుకు పనికొస్తా డమ్మా? కాకపోతే కళ్ళముందు కక్కటిల్లిపోతుంటే ప్రాణమొప్పక ఎవరో ఒకరం ఏ గంజినీళ్ళు పోసో నోరు తడుపుతున్నాం. ఆ ఒంటూపిరోడు బతికి బట్టకడితే నాలుగిళ్ళు అడుక్కుంటాడు. లేకపోతే వాళ్ళమ్మెళ్ళిన తోవే వెతుక్కుంటాడు."

కళ్ళనీళ్ళ పర్యంతమైంది సుమిత్ర ఆ రోజే. నాలుగు రూపాయలు దాని చేతి కిచ్చి వాడికి పాలు పట్టమని మరీ మరీ చెప్పింది కూడాను.

మోహన్ తలఎత్తి భార్య వంక చూశాడు. మేఘాలు విడిచిన ఆకాశంలా నిర్మలంగా, ప్రశాంతంగా ఉంది సుమిత్ర మొహం.

"అర్ఫనేజీ బాబుకంటే వీడికే మన అవసరం ఎక్కువ అనిపించింది నాకు. అందుకే..." సుమిత్ర వాక్యం పూర్తి చేయలేదు.

తనకంటే ఎదిగిపోయిన భార్యవంక సంభ్రమంగా చూస్తూ బాబుని సందిట్లోకి తీసుకున్నాడు మోహన్. ★

## భారత సూక్తము

తల్లీ నీ గుణరూప వృత్తముల కెందు
దగిన వరు నీవ యుమ్ముగ దడవి నెమ్మి
నీదు మనము చెక్కిన నృప కుమారు
గోరి వరియింపు మిదియ నాకును బ్రియంబు.

3-7-177

అమ్మా! నీ గుణం, రూపం, నడతలకు తగిన వరుణ్ణి నీవే నీకు అనుకూలంగా వెదుక్కో. నీ మనసుకు నచ్చిన రాజకుమారుని కోరుకో. వరించు. నీవు అలా చేయడమే నాకూ సంతోషం కలిగిస్తుంది.

ఇవి మద్రభూపతి తన కూతురు సావిత్రితో అన్న మాటలు. ఇవి ఆనాటి మాటలు. నేటికీ పరాల మూటలు.

వరుడు వధువును వచ్చటం ఈనాటి ఆచారం. వధువు వరుని వరించటం ఆనాటి ఆచారం. సంసారంలో సగానికి పైగా భాగస్వామిని స్త్రీ. ఆమెవల్లనే కుటుంబం నిర్వహించబడుతుంది. ఆమె సంతానాన్ని కంటుంది. వారి పోషణకు, వారి అభివృద్ధికి కారకురా లవుతుంది. ఇల్లు ఇల్లాలిదే కాని ఇంటివానిది కాదు. సమాజపు ఉనికికి కుటుంబమే మూలస్తంభం, కుటుంబానికి మూలస్తంభం మహిళ, కనుక ఆమె ఇచ్చవచ్చిన వరుణ్ణి ఎన్నుకోవడం సమంజసం. సమాజానికీ, కుటుంబానికీ శ్రేయస్కరం.

నేటి మన కథా సాహిత్యంలో చాలా భాగం యువతీ యువకులు వరించిన వారిని తలిదండ్రులు అంగీకరించకపోవడంమీద ఆధారపడి ఉంటున్నది. మద్రభూపతి ఆదర్శప్రాయుడైన తండ్రి రూపంలో ప్రత్యక్షం అవుతున్నాడు. తలిదండ్రులు అతణ్ణి అనుసరించడానికి ప్రయత్నిస్తే వివాహ వ్యవస్థకు పవిత్రత, విలువ కలుగుతాయి.

మద్రభూపతి కూతురికి ఉపదేశిస్తున్నాడు. రూపం, గుణం వీటికి తగిన వరుణ్ణి ఎన్నుకొమ్మన్నాడు. ఇది సాధారణం. కాని, అతడు వృత్తాన్ని గురించి చెప్పాడు. వృత్తం అంటే ఆమె జీవన విధానానికి తగినవాణ్ణి, ఆమె నడతకు తగినవాణ్ణి, ఆమె అభిరుచులను ఆదరించేవాణ్ణి ఎన్నుకొమ్మంటున్నాడు. వధూవరుల ఎన్నికలో ఈ వృత్తం ప్రధాన స్థానం వహిస్తున్నది. వృత్తాలు అనుకూలం కాకపోవడమే అనేక అనర్థాలకు కారణం అవుతున్నది. వృత్తం తెలుసుకునే బాధ్యత యువకులకు వదలడం మంచిది. వారే పరస్పరం అర్థం చేసుకోగలరు.

మద్రభూపతి తాను చెప్పినటువంటి వరుణ్ణి వెతికి వరించవలసిన బాధ్యత సావిత్రికి అప్పగించాడు. ఒక షరతు మాత్రం విధించాడు. "మనసు చెక్కిన నృపకుమారు" అన్నాడు. ఆమె వరించినవాడు నృపకుమారుడు కావాలి. ఈ షరతు వంశానికి, సరినంపదలకూ సంబంధించింది కాదని మనకు ముందు ముందు తెలుస్తుంది.

—దాశరథి రంగాచార్య